క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి


గోపాల్‌రెడ్డి

మార్కాపురం: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆ పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన డి.గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం ఇన్‌చార్జి అన్నా రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలలో డీవైఈఓ తనిఖీ


10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈఓ శామ్యూల్

కొమరోలు: మండలంలోని పలు పాఠశాలలను మార్కాపురం డీవైఈఓ శామ్యూల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుపై విద్యార్థులను ఆరా తీశారు. రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి 100 రోజుల ప్రణాళిక గురించి వివరించి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు తెచ్చుకోవాలని తెలిపారు.

పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ


విద్యార్థులకు దుస్తున్న అందజేస్తున్న ఎంఈఓ శ్రీనివాసరెడ్డి

పొదిలి: నిరుపేద విద్యార్థులకు సోమవారం ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా పుస్తకాలు, పెన్నులు, ఇతర వస్తువులు పంపిణీ చేస్తున్నామని ఎంఈఓ చెప్పారు. పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను ఎంఈఓ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షులు సామంతపూడి నాగేశ్వరరావు, కన్వీనర్ కల్లం సుబ్బారెడ్డి, యూటీఎఫ్ అధ్యక్షుడు గాలిముట్టి రమేష్, రాష్ట్ర నాయకులు పి.రమణారెడ్డి, హెచ్ఎం ఎస్‌వీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి మార్చురీ బాక్స్ వితరణ


మార్చురీ బాక్స్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ రమేష్‌కుమార్

బేస్తవారిపేట: మండలంలోని గలిజేరుగుళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో మార్చురీ బాక్స్‌ను సోమవారం అందజేశారు. దాతల సహకారంతో కొనుగోలు చేసిన ఫ్రీజర్‌ను పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్‌కుమార్‌కు అందించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ సభ్యులు ఎ.వెంకట రాయుడు, మంచా రాజు, యు.రంగనాయకులు, రంగస్వామిరెడ్డి, కోదండ రామిరెడ్డి, మురళి పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

మార్కాపురం రూరల్: మండలంలోని రాయవరం జిల్లా పరిషత్ పాఠశాలలో 61 మంది పదో తరగతి విద్యార్థులకు సోమవారం బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన శ్రీరాములు

కొమరోలు: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం కొమరోలు మండలంలోని హనుమంతరాయునిపల్లె-కొమరోలు గ్రామాల మధ్య చోటుచేసుకుంది. మండలంలోని చింతలపల్లె గ్రామానికి చెందిన శ్రీరాములు వ్యక్తిగత పనిపై కొమరోలుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. శ్రీరాములుకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

తూచేస్తున్నారా.. దోచేస్తున్నారా?

- కొలతల్లో తేడాతో నష్టపోతున్న వినియోగదారులు
- తనిఖీలు పెంచితేనే మోసాలకు కట్టడి


ప్రభుత్వ ఆమోదం లేని డిజిటల్ కాటా, రాళ్లు



మార్కాపురం:

గుండు సూది నుంచి గునపాల వరకు.. పప్పు నుంచి ఉప్పు వరకు ఏది కొనుగోలు చేయాలన్నా తూనికలు, కొలతలే ప్రామాణికం. అయితే ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలిచ్చిన కొందరు వ్యాపారులు వినియోగదారులను ఏమార్చి దోపిడీ చేస్తున్నారు. తూకాల్లో మోసాలను అరికట్టాల్సిన అధికారులు అడపాదడపా దాడులు చేస్తుండటం వ్యాపారులకు కలిసొస్తోంది. చిల్లర కొట్ల నుంచి సూపర్ మార్కెట్ల వరకు తూకాల్లో దగా జరుగుతోంది. రెడీమేడ్ ప్యాకెట్ల బరువులో తేడా ఉండటంతోపాటు త్రాసులో బండరాళ్లతోనూ మోసాలకు పాల్పడుతున్న తీరు వినియోగదారులను ముంచేస్తోంది. సాంకేతికత అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రజలు వస్తువుల కొనుగోళ్లలో మోసపోతూనే ఉన్నారు. పశ్చిమ ప్రకాశంలోని వివిధ గ్రామాలు, పట్టణాల్లో వినియోగదారులు తూకాలు, కొలతల్లో మోసపోతున్న వైనం ఇటీవల అధికారుల తనిఖీల్లో వెల్లడైంది.

డివిజన్ కేంద్రమైన మార్కాపురంతోపాటు నియోజకవర్గ కేంద్రాలైన యర్రగొండపాలెం, గిద్దలూరు, మండల కేంద్రాలైన కంభం, బేస్తవారిపేట, త్రిపురాంతకం, పెద్దదోర్నాల, పుల్లలచెరువు, తర్లుపాడు, పొదిలి, కొనకనమిట్ల తదితర ప్రాంతాలు వ్యాపార కేంద్రాలుగా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో సుమారు 450కి పైగా హోటళ్లు, సుమారు 20కి పైగా సినిమా థియేటర్లు, 200 రేషన్ షాపులు, సుమారు 250కి పైగా ఫ్యాన్సీ స్టోర్లు, 100కు పైగా అనధికార కూరగాయల విక్రయ కేంద్రాలు ఉన్నాయి. వినియోగదారుల అవగాహనా రాహిత్యాన్ని అలుసుగా తీసుకుంటున్న కొందరు వ్యాపారులు యథేచ్ఛగా మోసాలకు తెగబడుతున్నారు. ఎలక్ట్రానిక్ కాటాలను సైతం ట్యాంపరింగ్ చేసి వస్తువులను తూకం వేసి ఇస్తున్నారు. పలు రేషన్ దుకాణాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కూరగాయల దుకాణాల్లో ఇప్పటికీ బండ రాళ్లు వినియోగిస్తుండటం గమనార్హం.

ప్యాకింగ్‌లోనూ తేడాలు

పశ్చిమ ప్రకాశంలో ఇటీవల కాలంలో సూపర్ మార్కెట్లు వెలిశాయి. కందిపప్పు, బియ్యం, మినపప్పు, పసుపు, కారం, ఇలా వివిధరకాల నిత్యావసర వస్తువులన్ని అర్ధకిలో, కిలో ప్యాకెట్లలో విక్రయిస్తున్నారు. వాటిని కొనుగోలు చేసిన వినియోగదారులు ఇంటికి వెళ్లి తూకం వేస్తే తేడాలు వస్తున్నాయి. మార్కాపురం పట్టణంలో ఇటీవల బియ్యం కొనుగోలు చేసిన కొందరు తమ ఇళ్లకు వెళ్లి తూకం వేసుకోగా 25 కిలోల బస్తాలో 23 కిలోలే ఉన్నాయి. 100 కిలోల బస్తాకు 8 కిలోల తేడా ఉండటంతో ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధర ప్రకారం సుమారు 450 రూపాయలు నష్టపోవాల్సి వస్తోంది. నిత్యావసర వస్తువుల ప్యాకింగ్‌పై ధర, తయారీ తేదీ, కంపెనీ పేరు, టోల్ ఫ్రీ నంబర్, పరిమాణం నమోదు చేయకుండానే విక్రయిస్తున్నారు. సినిమా థియేటర్లలో తినుబండారాల విక్రయాలు ఇష్టారీతిగా సాగుతున్నాయి. మాంసం మార్కెట్లలో కూడా వ్యాపారుల చిల్లక్కొట్టుడుతో వినియోగదారులు మోసపోతూనే ఉన్నారు. కిలో చికెన్ కొనుగోలు చేసి ఇంటికి వచ్చి మళ్లీ తూకం వేస్తే 50 నుంచి 70 గ్రాములు తేడా వస్తోంది.

అవగాహనా లోపమే అసలు సమస్య

మార్కాపురం, పొదిలిలో తూనికలు కొలతల శాఖ కార్యాలయాలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధిక ధరలకు విక్రయించినా, నాణ్యత లేని వస్తువులను అమ్మినా, తూనికల, కొలతల శాఖాధికారులకు ఫిర్యాదు చేస్తే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తారు. అయితే ప్రజలకు అవగాహన లేకపోవడం, అధికారుల దాడులు తక్కువ కావడంతో వ్యాపారులదే ఇష్టారాజ్యమైంది.



కేసులు నమోదు చేస్తున్నాం

మార్కాపురం ప్రాంతంలో ఇటీవల కాలంలో తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడుతున్న పలువురిపై కేసులను నమోదు చేశాం. మార్కాపురం మండలం రాయవరం వద్ద పత్తి లోడ్ లారీని తనిఖీ చేసి తూకాల్లో తేడాలు ఉండటంతో రూ.15 వేలు జరిమానా విధించాం. రాచర్ల మండలం చోళ్లవీడులో కూడా తనిఖీలు చేపట్టాం. రైతులు పత్తిని విక్రయించే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. వ్యాపారులు కచ్చితంగా తూనికలు, కొలతల శాఖ కార్యాలయానికి వచ్చి ముద్ర వేయించుకోవాలి. వస్తువులను అధిక ధరలకు విక్రయించినా, తూకాల్లో తేడా ఉన్నా కేసులు నమోదు చేస్తాం. ప్రజలు కూడా అవగాహన పెంపొందించుకుని మోసాలపై సమాచారం ఇవ్వాలి.

– రియాజ్, తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్, మార్కాపురం


దుస్తులు పంపిణీ చేస్తున్న అన్నా రాంబాబు, నాయకులు

దివ్యాంగులకు దుస్తులు పంపిణీ

పొదిలి రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే, పార్టీ మార్కాపురం ఇన్‌చార్జి అన్నా వెంకట రాంబాబు ఆధ్వర్యంలో దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. పొదిలి, కొనకనమిట్ల మండలాల దివ్యాంగులతో పాటు రెండు మండలాలకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్, వెబ్ చానళ్ల విలేకర్లకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం అందరికీ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, జిల్లా నాయకులు గొలమారి చెన్నారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, నూర్జహాన్‌బేగం, ఉడుముల గురువారెడ్డి, కొనకనమిట్ల ఎంపీపీ మోరబోయిన మురళీ, జెడ్పీటీసీ సభ్యుడు అక్కిదాసరి ఏడుకొండలు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మెట్టు వెంకటరెడ్డి, ఏలూరి సంజీవరెడ్డి, జాకీర్, సింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మస్తాన్‌వలి, నాయబ్, భాను, అశోక్, ప్రకాశ్‌రెడ్డి ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురంలో మున్సిపల్ కార్మికులకు..

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు తన కార్యాలయంలో సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అన్నా మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్త డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సౌజన్యంతో సుమారు 200 మంది కార్మికులకు చీరలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ పుట్టిన రోజును పురస్కరించుకుని కార్మికులకు దుస్తులు అందించినట్లు తెలిపారు. క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎం.శ్రీనివాసులు, నాయకులు సతీష్, ఉత్తమ్‌కుమార్, రోజీలిడియా, రఫీ, చిట్టిబాబు, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


మార్కాపురంలో దుస్తులు పంపిణీ చేస్తున్న అన్నా రాంబాబు

వంద మంది పాస్టర్లకు దుస్తుల పంపిణీ


కమలా స్కూల్లో క్రీస్తు రాకను తెలుపుతూ చిన్నారుల ప్రదర్శన

మార్కాపురం: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలోని వంద మంది పాస్టర్లకు సోమవారం ఎస్ఎస్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దుస్తులు అందించారు. గత 15 ఏళ్లు దుస్తులు అందిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు నాదెళ్ల సుబ్రహ్మణ్యం, చైర్మన్ నాదెళ్ల చంద్రమౌళి తెలిపారు. కార్యాలయ మేనేజర్ పూసల గాలెయ్య ఖమర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

పట్టణంలోని కమలా హైస్కూల్లో కరస్పాండెంట్ పి.పవన్‌కుమార్, డైరెక్టర్ సింధూజ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ స్వరూప్ రంజన్ పర్యవేక్షణలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.


మార్కాపురంలో దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్ఎస్ ట్రస్టు ప్రతినిధులు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


గొట్లగట్టు సెయింటాన్స్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

మార్కాపురం టౌన్: స్థానిక అరవింద స్కూల్లో కరస్పాండెంట్ సి.వాణి ఆధ్వర్యంలో సోమవారం సెమీ క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ విజయభాస్కర్‌రావు క్రిస్మస్ కేక్ కట్ చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. అలాగే, శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కడప బాలవికాస్ కరస్పాండెంట్ ఎస్.సుబ్బరాయుడు పాల్గొన్నారు.


సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్లలోని స్పందన స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్‌కుమార్‌రెడ్డి అధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బెంగళూరు ఐఎల్‌ఎం ప్రతినిధుల పర్యవేక్షణలో విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్, నృత్యాలు, సంగీత ప్రదర్శన ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ పేర్ల పరమేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కేక్ కట్‌చేస్తున్న పాస్టర్ విజయభాస్కర్, ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు సెయింటాన్స్ పాఠశాలలో సోమవారం సెమీ క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్లు నారాయణ, రమణ పర్యవేక్షణలో కేక్ కట్ చేశారు. విద్యార్థులు వేషధారణలతో ఆకట్టుకున్నారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వ్యాస రచన పోటీలు, ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు


పాలిటెక్నికల్ కళాశాల వద్ద బోల్తాపడిన కారు


నల్లకాల్వ వద్ద ప్రమాదంలో గాయపడిన మోహన్

కంభం: మండలంలో సోమవారం వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. కారు అదుపు తప్పి బోల్తా పడటంతో డ్రైవర్ గాయపడిన సంఘటన సోమవారం తెల్లవారుజామున కంభం పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలో చోటుచేసుకుంది. తెనాలి నుంచి నంద్యాలకు బాడుగకు వెళ్లిన ఓ కారు తిరుగు ప్రయాణంలో ఉంది. మార్గమధ్యంలో ముగ్గురు ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తుండగా కంభం పాలిటెక్నికల్ కళాశాల సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వెంకటేశ్వర్లు గాయపడగా కారులో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉండటంతో కారు అదుపు తప్పి బోల్తాపడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అలాగే నల్లకాల్వ మూలమలుపు వద్ద ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొనడంతో పందిళ్లపల్లి గ్రామానికి చెందిన కొండెపోగు మోహన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మెడికల్ కళాశాల రద్దు సరికాదు


సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్ష నాయకులు

- డాక్టర్లు, బోధనా సిబ్బంది బదిలీలు నిలిపేయాలి
- ప్రైవేట్‌కు అప్పగించే యోచన సరికాదు
- కూటమి ప్రభుత్వానికి అఖిలపక్ష నాయకుల డిమాండ్

మార్కాపురం: జిల్లాలో వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురంలో గత ప్రభుత్వంలో నిర్మాణం ప్రారంభించిన మెడికల్ కళాశాలను రద్దు చేసి ప్రైవేట్‌కు అప్పగించాలని చూడటం మంచివి కాదని మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ నాయకులు పేర్కొన్నారు. మెడికల్ కాలేజీ విషయంలో కూటమి ప్రభుత్వ చర్యలను తప్పుబట్టారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మెడికల్ కళాశాల నిర్మించాలని కోరుతూ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ అందె నాసరయ్య, కోకన్వీనర్ డీకేఎం రఫీ, కమిటీ సభ్యులు వి.సుదర్శన్, అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ.. మార్కాపురం డివిజన్‌లోని గిద్దలూరు, యర్రగొండపాలెం, మార్కాపురం నియోజకవర్గాల్లో చెంచు గిరిజనులు, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని నిలిపివేయడం వల్ల నాణ్యమైన వైద్యానికి దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. జీజీహెచ్‌లో డాక్టర్ల బదిలీలను నిలిపివేయాలని కోరారు. మెడికల్ కళాశాల నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేయాలని, వైద్యులను పునర్నియమించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులైన షేక్ రెహానాబాను, డి.సోమయ్య, ఎస్కే ఖాశీం, జె.రాజు, నాగూర్‌మీరావలి, మస్తాన్ వలి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

గిద్దలూరు రూరల్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత డాక్టర్ మొఱ్రిపిచ్చయ్యయాదవ్‌ను మార్కాపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి శామ్యూల్ సోమవారం సన్మానించారు. సోమవారం పాదలకుంటపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన అనంతరం హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పిచ్చయ్యయాదవ్‌ను డీవైఈఓ సన్మానించారు. పట్టణంలోని గ్రంథాలయంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పిచ్చయ్యయాదవ్ సేవలను పలువురు కొనియాడారు. ప్రతి నెలా తన జీతంలో కొంత మేర నగదు విద్యార్థుల చదువులకు ఖర్చు చేస్తూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చారని కొనియాడారు. విశ్రాంత ఉపాధ్యాయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జి.రవీంద్రారెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పి.స్వరూపారెడ్డి, గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పిచ్చయ్యయాదవ్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు


తొలగిన చెత్త సమస్య

సాక్షి ఎఫెక్ట్..


బ్రహ్మంగారిమఠం వీధిలో చెత్త తొలగిస్తున్న కార్మికులు

కొమరోలు: కొమరోలు పట్టణంలోని పలు వీధుల్లో పారిశుధ్యం లోపించడంపై ‘కొమరోలులో అధ్వానంగా పారిశుధ్యం’ శీర్షికన సోమవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. స్థానిక బ్రహ్మంగారి మఠం వీధి, శివాజీ నగర్ కాలనీలో చెత్తను పంచాయతీ పారిశుధ్య కార్మికులతో సోమవారం శుభ్రం చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

ఘనంగా రైతు దినోత్సవం


రైతుల బాధలపై నృత్య రూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మార్కాపురం: స్థానిక వాసవీ విద్యా నికేతన్‌లో డైరెక్టర్ రంగయ్య ఆధ్వర్యంలో సోమవారం రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యవసాయం, రైతు విశిష్టత గురించి ఎంఈఓ రాందాస్‌నాయక్ వివరించారు. దళారులతో రైతులు పడే బాధలపై విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకం ఆలోచింపజేసింది. అనంతరం సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఏఓ రంజిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.